క్లుప్తంగా

పోలీసు సిబ్బందికి సేవా పతకాలు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని పలువురు పోలీసు సిబ్బందికి సేవా పతకాలను హోంశాఖ శుక్రవారం ప్రకటించింది. ఆర్ఎస్ఐ సాయిలు, సిద్దిపేట త్రీ టౌన్ ఎస్ఐ కొమురయ్య, భూంపల్లి ఏఎస్ఐ బాలమల్లయ్య, సిద్దిపేట ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ వై క్రిష్టారెడ్డి, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రాంచంద్రారెడ్డి, గజ్వేల్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్‌రావు, సిద్దిపేట ఫైర్ స్టేషన్ డ్రైవర్ అమర్‌సింగ్‌కు సేవా పతకాలకు ఎంపికైనట్లు ఉత్తర్వుల్లో హోం శాఖ పేర్కొంది.

వ్యాయామంతో ఆరోగ్యం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐ మున్నూరు కృష్ణ

దుబ్బాక: ఆగస్టు 6న జిల్లా పోలీస్ శాఖ, ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించే హాఫ్ మారథాన్ రన్ విజయవంతం చేయాలని సీఐ మున్నూరు కృష్ణ అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో హాఫ్ మారథాన్ రన్ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత వ్యాయామంపై శ్రద్ధ వహించాలని కోరారు. ఈ రన్‌లో పాల్గొనే యువకులు తమ మొబైల్ నంబర్‌తో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. విజేతలకు నగదుతోపాటు బహుమతులు అందిస్తున్నారన్నారు.కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రమేశ్, హరి మోహన్ రెడ్డి తదితరులున్నారు.

నేడు శనిత్రయోదశి మహోత్సవం

వర్గల్(గజ్వేల్): శ్రీవిద్యాసరస్వతీ శనీశ్వర క్షేత్రం శనివారం శనిత్రయోదశి మహోత్సవానికి సిద్ధమైంది. శనిత్రయోదశి పర్వదినం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి శనీశ్వర సామూహిక తైలాభిషేక పూజలు ప్రారంభమవుతాయి. విడతలవారీగా సాయంత్రం వరకు కొనసాగుతాయి. భక్తులు రూ. 250 టికెట్ తీసుకుని తైలాభిషేక పూజలో పాల్గొనవచ్చు. పూజకు అవసరమైన నువ్వులు, నూనె, కొబ్బరి కాయ తదితర పూజాద్రవ్యాలు, నల్లని వస్త్రం ఆలయవర్గాలు అందజేస్తారు. ప్రతి భక్తుడికీ మహాప్రసాదం అందజేస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు చంద్రశేఖరశర్మ సిద్ధాంతి తెలిపారు.

త్వరలో అందుబాటులోకి స్టీల్ బ్యాంక్

హుస్నాబాద్: పర్యావరణ పరిరక్షణ కోసం త్వరలో పట్టణంలో స్టీల్ బ్యాంక్ అందుబాటులోకి రానుంది. పట్టణంలో మెప్మా (పట్టణ మహిళా సమాఖ్య) ఆధ్వర్యంలో మున్సిపల్ కాంప్లెక్స్‌లో స్టీల్ బ్యాంక్‌తోపాటు ట్రిపుల్‌ఆర్ కేంద్రం ప్రారంభించనున్నారు. ప్లాస్టిక్ రహిత పట్టణం కోసం మెప్మా ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంక్, ట్రిపుల్ ఆర్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. పెళ్లిళ్లు, శుభ కార్యాలయాలకు అవసరమయ్యే స్టీల్ వస్తువులు, గ్లాసులు, ప్లేట్లు, బకెట్లు, బేషన్లు తదితర వస్తువులు స్టీల్ బ్యాంక్ ద్వారా వస్తువులు అతి తక్కువ ధరకు అందించనున్నారు. వారం రోజుల్లో ఈ రెండు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు మెప్మా సీఈఓ రాజు తెలిపారు.

టార్గెట్ 65 వేల మొక్కలు

మద్దూరు(హుస్నాబాద్): 9వ విడత హరితహారంలో భాగంగా ఉమ్మడి మద్దూరు మండలంలో 65 వేల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఉమ్మడి మద్దూరులో రెండు, మూడురోజుల్లో హరితహారం ప్రారంభించనున్నామని అన్నారు. ప్రతి గ్రామంలో సుమారు 3 వేల మొక్కలు నాటనున్నామని చెప్పారు. హరితహారం లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు సంఘీభావం



మాట్లాడుతున్న ఏగొండస్వామి

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ఐవోసీ వద్ద సమస్యల పరిష్కారం కోసం పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మెకు డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి శుక్రవారం మద్దతు తెలిపారు.నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో తమ వంతు పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు యాదగిరి, చంద్రం, కిష్టయ్య, నర్సింలు, రాజు, శ్రీను, నర్సవ్వ, చంద్రవ్వ, కిష్టవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన హరితహారం మొక్కలు





అక్కన్నపేట(హుస్నాబాద్): హరితహారం మొక్కలు ఎండిపోతున్నాయి. అక్కన్నపేట మండలం చౌటపల్లి నుంచి మల్లంపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. సుమారుగా పదుల సంఖ్యలో మొక్కలు ఎండిపోతున్నా అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరం. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పలు గ్రామాల్లో కూడా మొక్కలు ఎండిపోతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మొక్కలు ఎండకుండా తగిన చర్యలు తీసుకోవాలని చౌటపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

వచ్చేనెలలో బీజేపీ మేనిఫెస్టో విడుదల

మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్



మాట్లాడుతున్న నందీశ్వర్‌గౌడ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వచ్చే నెలలో రాష్ట్ర బీజేపీ తన ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు నందీశ్వర్‌గౌడ్ తెలిపారు. వందరోజుల కార్యాచరణతో ప్రజల్లోకి బీజేపీ వెళుతుందని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతామని అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని కాంగ్రెస్ ప్రజలతో మైండ్ గేమ్ ఆడుతోందన్నారు. దేశంలో, రాష్ట్రంలో బీజేపీ స్వంతగా అధికారంలోకి రాబోతోందన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 20న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇంబ్రహీంనగర్ డబుల్‌బెడ్‌రూంలు పరిశీలిస్తారన్నారు. ఈ నెల 16న టిఫిన్ బైఠక్ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు బాలేష్‌గౌడ్, పత్రి శ్రీనివాస్‌యాదవ్, శివకుమార్, వేణుగోపాల్, శంకర్, ఉపేందర్, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

ఇంటికో ఉద్యోగం ఏమైంది?



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

కోహెడరూరల్(హుస్నాబాద్): నీళ్లు, నిధులు, నియామకాలు, దళితులకు మూడెకాల భూమి, ఇంటికో ఉద్యోగం ఏమైందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెంచెర్వుపల్లిలో పల్లెపల్లెకు ప్రవీణన్న.. గడప గడపకూ కాంగ్రెస్‌లో కార్యకర్తలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నెరవేర్చబోయే హామీలను వివరించారు. అనంతరం ఆయన, కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, మాయ మాటలు చెప్పి సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చి తెలంగాణ ప్రజలను నిండాముంచారన్నారు. కాంగ్రెస్ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పది వేల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఒక్క డబుల్ బెడ్‌రూం కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు.అధికారంలోకి రాగానే వృద్ధులు, దివ్యాంగులు, వింతువులకు 4 వేల రూపాయల పింఛన్ ఇస్తామని తదితర హామీలు ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్ నాయకులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలి



అక్కన్నపేట తహసీల్దార్‌కు
వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఐ నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): కొత్తరేషన్ కార్డులు, ధరణి పోర్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన తహసీల్దార్ సంజీవ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ, 9 ఏళ్లు గడుస్తున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్‌కార్డూ మంజూరు చేయలేదన్నారు.అలాగే ధరణి పోర్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. పేదల సమస్యలు పరిష్కరించకుండా ఎన్నికల హడావిడి చేస్తోందని ఆరోపించారు. రాబోవు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధం ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పర్శరాములు, కొమురయ్య, గంగయ్య, రాజకొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త



మాట్లాడుతున్న ఎస్ఐ శివానందం

చిన్నకోడూరు(సిద్దిపేట): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శివానందం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో కనువిప్పు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షణికావేశంలో చేసే పొరపాట్లు మనిషి జీవితాన్ని మార్చేస్తాయని, ఏదైనా సమస్య ఉంటే గ్రామ పెద్దలతో కూర్చుని మాట్లాడుకోవాలన్నారు. పరిష్కారం కాకుంటే స్టేషన్‌కొస్తే ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. బాలికలు, మహిళల రక్షణ చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఏదైనా సమస్య వస్తే డయల్ 100కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జయవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ బాలయ్య, పోలీస్ సిబ్బంది, కళాకారుల బృందం పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేటరూరల్: మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు గుర్రాలగొందిలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణను మహిళలు, యువతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాలక్రిష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొందిలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్ శిక్షణలో పాల్గొనే వారికి వినియోగించే సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ హరీశ్, ఏపీఎం ధర్మసాగర్ , సీసీ భాగ్యమ్మ పాల్గొన్నారు.

రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బదిలీ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ జగిత్యాలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఓటుహక్కు ఓ ఆయుధం



హుస్నాబాద్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

హుస్నాబాద్: ఓటుహక్కు ఆయుధం లాంటిదని రెవెన్యూ అధికారులు అన్నారు. పట్టణంలోని 17, 18, 19 పోలింగ్ స్టేషన్లతో రెవెన్యూ అధికారులు ఓటు వేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈవీఎం మిషన్ల ద్వారా ఓటు వేసే విధానంపై ప్రతి ఓటరూ అవగాహన పెంచుకోవాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎం మిషన్ల ద్వారానే ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటోందన్నారు. సెప్టెంబర్ చివర వరకు ఓటు వేసే విధానంపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుహాసినీ, కరీం తదితరులు పాల్గొన్నారు.

కోహెడలో

కోహెడ(హుస్నాబాద్): 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు వయస్సు నిండిన యువతీ యువకులను నూతన ఓటరుగా నమోదు చేయాలని ఎలక్షన్ డీటీ అశోక్‌కుమార్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ, మరణించిన వారి పేర్లను ఫాం 7 ద్వారా తొలగించాలన్నారు. ఓటరు కార్డు సవరణను ఫాం 8 ద్వారా సవరవణ చేయాలని బీఎల్ఓలకు సూచించారు. శనివారం లోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌హెచ్‌పీ రంజిత్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

న్యూట్రీషన్ కిట్‌లతో ఎంతో మేలు

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



కిట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: మహిళల్లో రక్తహీనత, పోషకాహార లోపాలు తగ్గించేందుకు కేసీఆర్ న్యూట్రీషన్ కిట్లు ఎంతగానో ఉపయోగపడుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని 15 మంది గర్భిణులకు కేసీఆర్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం గర్భిణులకు కేసీఆర్ న్యూట్రీషన్ కిట్లు అందజేస్తోందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని మౌలిక వసతులు, మెరుగైన వైద్య సేవలు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొంకట నళినిదేవి, సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

9వ రోజుకు జీపీ కార్మికుల సమ్మె



కొండపాక: రోడ్డును ఊడుస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు

తొగుట(దుబ్బాక): గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు కోరారు. మండల కేంద్రంలో నిరసన దీక్షలు చేస్తున్న కార్మికులకు శుక్రవారం ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు. కాగా కార్మికుల దీక్షలకు బీఎస్పీ దుబ్బాక నియోజకవర్గ అనాజీపూర్ సంజీవ్ సంఘీభావం తెలిపారు.

కొమురవెల్లిలో

కొమురవెల్లి(సిద్దిపేట): గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారానికి 9 రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా సమస్యలు పరిష్కారించాలని కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ గీస భిక్షపతికి కార్మికులు వినతి పత్రం అందించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పిలుపు మేరకు నాయకులు సమ్మెకు సంఘీభావం తెలిపారు.

కోహెడలో..

కోహెడ(హుస్నాబాద్): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి 9వ రోజుకు చేరిన కార్మికుల దీక్షకు సంఘీభావం తెలిపారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నియోజకవర్గ ఇన్‌చార్జి రవిందర్‌గౌడ్ కార్మికుల దీక్ష శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం తెలిపారు.

అక్కన్నపేటలో..

అక్కన్నపేట(హుస్నాబాద్): పంచాయతీ కార్మికులు శుక్రవారం వంటావార్పు చేసి నిరసన తెలిపారు. కార్మిక నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి సంఘీభావం తెలిపారు.

హుస్నాబాద్‌రూరల్‌లో..

హుస్నాబాద్‌రూరల్: శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులకు జీపీ కార్మికులు వినతి పత్రాలు అందించారు. ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్దూరులో

మద్దూరు(హుస్నాబాద్): జీపీ సమ్మెకు కాంగ్రెస్ నాయకులతో కలిసి జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె చేపట్టి తొమ్మిది రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం చాలా బాధాకరమన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు దాసరి పద్మారెడ్డి, మాజీ సర్పంచ్ జేడి కంటి సురేష్, నాయకులు పాల్గొన్నారు.

కొండపాకలో..

కొండపాక(గజ్వేల్): పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం ముందు చేపట్టిన నిరసన సమ్మె శుక్రవారంతో 9వ రోజుకు చేరింది. సమ్మెను పురస్కరించుకొని మండల పరిధిలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద రోడ్లను ఊడ్చుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్‌నర్సయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, బోగి సాయికుమార్, ఆరుట్ల నర్సయ్య, పిల్లి లచ్చవ్వ, బాలవ్వ, నాగవ్వ, లక్ష్మి పాల్గొన్నారు.

చిన్నకోడూరులో

చిన్నకోడూరు(సిద్దిపేట): స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **సమాజ సేవే ధ్యేయం**

జగదేవ్‌పూర్(గజ్వేల్): సామాజిక కార్యక్రమాలు చేపట్టడమే ఆర్యవైశ్య మహాసభ లక్ష్యమని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్ ఆర్యవైశ్య యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రావి కంటి చంద్రశేఖర్, ఆశ్రయం ట్రస్ట్ సౌజన్యంతో మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో సుమారు 600 మందికి పైగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాలుగా సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

◆ **ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించండి**

హుస్నాబాద్: రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల, గ్రామీణ ప్రాంతాల్లో వృత్తి పై ఆధారపడి జీవిస్తున్న విశ్వకర్మలకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించాలని హన్మకొండలోని ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్ఎన్‌పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు శుక్రవారం అఖిల భారత విశ్వకర్మ పరిషత్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ, నాయకులు సుదర్శనచారి, ఉప్పుల శ్రీనివాస్, నాగభూషణం ఉన్నారు.

◆ **బాధిత కుటుంబానికి చేయూత**

తొగుట(దుబ్బాక): మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి మదిర వడ్డెర కాలనీలో ఇటీవల అప్పుల బాధ తట్టుకోలేక పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన వడ్డె రవి కుటుంబాన్ని ఆర్ఎస్ఐ సాయి ప్రసాద్ శుక్రవారం పరామర్శించారు. రవి ముగ్గురు కూతుళ్ల చదువులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయంతో పాటు 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కనకయ్య, శ్రీనివాస్, ఎల్లయ్య ఉన్నారు.

◆ **విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి**

దుబ్బాక: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సామాజిక సమరసత వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవా వారి ఆర్థిక సౌజన్యంతో విద్యార్థులకు బ్యాగ్‌లు, నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అరవింద్, సభ్యులు బాలయ్య , కమలాకర్, లలిత, పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ రెడ్డి, తదితరులున్నారు.

◆ **మంత్రిని కలిసిన ఎఫ్‌పీఓ చైర్మన్**



చైర్మన్‌ను అభినందిస్తున్న మంత్రి హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పీఓ) చైర్మన్‌గా ఎన్నికైన ఏలేటి వెంకట్‌రెడ్డితో పాటు డైరెక్టర్లు శుక్రవారం హైదరాబాద్‌లోని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి నూతన చైర్మన్, డైరెక్టర్లను అభినందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ఎఫ్‌పీఓ పాటుపడాలని సూచించారు.

◆ **మంత్రిని కలిసిన బీఆర్ఎస్ నేతలు**

గజ్వేల్‌రూరల్: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండ మధు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చెరుకు చంద్రమోహన్‌రెడ్డి వారి జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును కలిశారు. వారి వెంట ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులున్నారు.

◆ **ఘనంగా మహిషాసురమర్ధిని జాతర**

గజ్వేల్‌రూరల్: మహిషాసుర మర్దిని అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. మండల పరిధిలోని బెజుగామలో కొలువైన మహిషాసుర మర్దిని అమ్మకు ప్రతియేటా ఆషాఢమాసంలో జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా గావురంగాలు, పోతరాజుల విన్యాసాలు, తొట్టెల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలు భారీగా తరలివచ్చారు.

◆ **ఘనంగా నాయకుల జన్మదినం**

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో రైతు బంధు సమితీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవిందర్ ఆధ్వర్యంలో శుక్రవారం గజ్వేల్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండ మధు జన్మదినం పురస్కరించుకొని కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి జరుపుకొంటున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పుల్లోజు కిరణ్‌కుమార్, కోల శ్రీనివాస్, బచ్చలి మహిపాల్, కనుకయ్య, ఎంపీటీసీ భూములుగౌడ్, కొండపాక మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నూనె కుమార్, మండల రైతు బంధు కోఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య, నాయకులు పాల్గొన్నారు.

◆ **ప్రతి జర్నలిస్టుకూ బీమా**

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రతి జర్నలిస్టుకూ స్వంత డబ్బులతో 10 లక్షల జనరల్ ఇన్సూరెన్స్ చేయిస్తానని వృక్ష ప్రదాత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తంగళ్లపల్లిలోని కిష్టస్వామి గుట్టపై విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి జర్నలిస్టు కుటుంబానికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తలారి అశోక్, పున్నం రాజు తదితరులు ఉన్నారు.

◆ **మహిళా రైతులు మెలకువలు తెలుసుకోవాలి**

సిద్దిపేటరూరల్: మహిళా రైతులు వ్యవసాయంలోని కొన్ని మెలకువలు తెలుసుకోవడం ద్వారా మరింత దిగుబడి పొందేందుకు అవకాశం ఉందని ఏఓ రమణిరెడ్డి అన్నారు. నారాయణరావుపేట మండలం పరిధిలోని గుర్రాలగొంది మహిళా రైతులకు వరి నాటు విధానం, పంట యాజమాన్య పద్ధతులపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రమణిరెడ్డి మాట్లాడుతూ బాటలు తీసుకోవడం ద్వారా మొక్కకు గాలి, సూర్యరశ్మి మంచిగా లభించి అధిక దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ , రైతులు పాల్గొన్నారు.

◆ **ట్రిపుల్‌ఐటీ విద్యార్థినికి సన్మానం**

నంగునూరు(సిద్దిపేట): గట్లమల్యాలకు చెందిన నిరుపేద ఎస్టీ విద్యార్థి బానోతు శ్రావణి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం తెలిసిందే. విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సీఐ జానకిరాంరెడ్డి, రాజగోపాల్‌పేట ఎస్ఐ రాజుగౌడ్, శుక్రవారం విద్యార్థిని సన్మానించి బహుమతి అందజేశారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థి ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం అభినందనీయమని, విద్యార్థులు చక్కగా చదివి ప్రయోజకులు కావాలన్నారు.

◆ **24న చలో కలెక్టరేట్**

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఈనెల 24న పట్టణకేంద్రం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ, అక్కడే ధర్నా చేపట్టనున్నట్లు జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్, జెడ్పీ ఫ్లోర్ లీడర్ గిరికొండల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణకేంద్రంలోని వాసవీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దుల్మిట్ట మండలాల జేఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. చేర్యాల నేడు పూర్తిగా అస్తిత్వాన్ని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పుర్మ ఆగంరెడ్డి, ఆముదాల మల్లారెడ్డి, ఆదిశ్రీనివాస్, అందె అశోక్, మల్లిగారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

◆ **యువత క్రీడల్లో రాణించాలి**

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని, వారికి కావాల్సిన ప్రోత్సాహకాలు అందించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తాయని నేస్తం సోషల్ సర్వీస్ సొసైటీ అడ్వైజర్ మడప రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం కూచనపెల్లి క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ, చదువుతోపాటు యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నేస్తం సొసైటీ కార్యదర్శి వంశీ, కార్తీక్, పూర్ణచందర్, సాయి, శ్రావణ్, కల్యాణ్ పాల్గొన్నారు.

◆ **పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు**

మద్దూరు(హుస్నాబాద్): పచ్చిరొట్ట సాగుతో భూసారం పెరుగుతోందని ఏవో రామకృష్ణ అన్నారు. శుక్రవారం దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో జీలుగ సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడటం వల్ల భూమిలో సారవంతం తగ్గుతోందన్నారు. జీలుగ, జనుము విత్తనాలు సాగు చేయడం ద్వారా భూసారం పెరుగుతోందన్నారు. ఇప్పటి వరకు మండలంలో 235 ఎకరాల్లో జీలుగు సాగు చేశామన్నారు. కార్యక్రమంలో ఏఈవో అనూష, కల్పన తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): జీలుగ వేసిన క్షేత్రాల్లో పంటల దిగుబడి పెరుగుతోందని ఏఓ సంతోష్ పేర్కొన్నారు. మండలంలోని కల్లెపెల్లిలో శుక్రవారం జీలుగు క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేలలో సారం పెరిగి భౌతిక స్థితి మెరుగవుతోందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మౌనిక, రైతులు పాల్గొన్నారు.

◆ **ఎమ్మెల్సీ పరామర్శ**



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

గజ్వేల్‌రూరల్: నల్గొండ జిల్లా లింగాల గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి(51) కొంతకాలంగా గజ్వేల్ పట్టణంలోని ఆఫీసర్స్ కాలనీలో నివాసముంటూ రాయపోల్ మండలం వడ్డేపల్లిలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోలజీ సబ్జెక్టు బోధిస్తుండేవాడు. గురువారం రాత్రి గజ్వేల్‌లోని తన నివాసంలో గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి శుక్రవారం గజ్వేల్‌కు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అలాగే పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధరశర్మ, గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగంగౌడ్‌లు పరామర్శించారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన పీఆర్‌టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.